క్లుప్తంగా

ప్రకృతి సాగుపై అవగాహన అవసరం


పాటలు పాడుతున్న విద్యార్థులు

బేస్తవారిపేట: విద్యార్థి దశ నుంచే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు రైతులు పండించే పంటలు, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. క్విజ్, ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో పాటలు పాడించడం, కథలు చెప్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పొదిలి ఎంపీడీఓ


విజయలక్ష్మిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

పొదిలి రూరల్: పొదిలి నూతన ఎంపీడీఓగా ఇ.విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆమె పదోన్నతిపై పొదిలిలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు పొదిలి ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన శోభన్‌బాబు ఈఓఆర్డీగా యథాస్థానానికి వెళ్లారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా విజయలక్ష్మి ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శోభన్‌బాబు, ఎన్.శ్రీనివాస రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

డీఎస్సీ గడువు 90 రోజులు పెంచాలి


సబ్‌కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న చిన్నకోటేనాయక్ తదితరులు

మార్కాపురం: డీఎస్సీ దరఖాస్తు గడువును మరో 90 రోజులు పెంచాలని కోరుతూ సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌కు ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ డి.చిన్నకోటేనాయక్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, ఎస్సీ, ఎస్టీలకు దరఖాస్తు రుసుం తగ్గించాలని, ఆఫ్‌లైన్‌లో ఎగ్జామ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం మేధాశక్తికి దోహదం

గిద్దలూరు రూరల్: విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవాలని స్థానిక గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్న కుమారి సూచించారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో నీతి కథలు చదివించి వాటి సారాంశాన్ని వివరించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ విలువైన సమయాన్ని పుస్తకాలు చదివేందుకు, విజ్ఞానం పెంచుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, రిటైర్డ్ హెచ్‌ఎం రామిరెడ్డి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం: యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామానికి చెందిన దొంత శ్రీనివాసగౌడ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం 23,900 ఆర్థిక సాయం అందజేసినట్లు మార్కాపురం గౌడ సంఘం అధ్యక్షుడు ఐ.రంగస్వామి గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, ఎ.క్రిష్టయ్య గౌడ్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో స్వామివారు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ సమీపంలో కోలాటం, అగ్గిసేవ భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామివారి మూల విరాట్‌తోపాటు గిరిజానాథస్వామి, వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య నిపుణులు(ఫైల్)


బీపీ, రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)


ఉచితంగా మందులు పంపిణీ(ఫైల్)

రోగమొచ్చినా..రొప్పొచ్చినా.. భారం మీదే..!

- గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు కూటమి సర్కారు మంగళం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచితంగా పరీక్షలు, మందులు పంపిణీ
- జగనన్న సురక్ష పేరుతో పల్లెల్లో వైద్య సేవలు, ఇంటింటికీ వైద్య బృందం
- ప్రస్తుతం వైద్య శిబిరాల జాడ లేకపోవడంతో రోగులకు తప్పని అవస్థలు


జగనన్న సురక్షలో భాగంగా వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్(ఫైల్)

బేస్తవారిపేట:

ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. జబ్బు చేసిన పేదలు వ్యయప్రయాసలకు గురై ఆర్థికంగా చితికిపోకుండా అండగా నిలవాల్సిన ప్రభుత్వం అది తమ పనికాదన్నట్లు వ్యవహరిస్తుండటంతో పల్లెల్లో వైద్య సేవలు పడకేశాయి. ఆధునిక వైద్య సేవలు దూరం కావడంతో రోగమొచ్చినా రొప్పొచ్చినా మండల కేంద్రాలు, ఇతర పట్టణాల్లో ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేసిన విషయం తెలిసిందే. ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య నిపుణులతో రోగులకు సేవలు అందించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్య శ్రీ కింద చికిత్స చేయించుకునేందుకు వీలుగా సిఫార్సు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు జగనన్న సురక్ష శిబిరాలకు రప్పించి పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె సంబంధిత రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. సాయంత్రం వరకు శిబిరంలో అందుబాటులో ఉండి 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. గుండె సంబంధిత వ్యాధుల రోగులకు ఈసీజీ పరీక్షలు సైతం చేశారు. అలాగే దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి సర్కారు ప్రజారోగ్యాన్ని చిన్నచూపు చూస్తోంది. గడిచిన 11 నెలలుగా గ్రామాల్లో ఎక్కడా వైద్య శిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో సీజనల్ వ్యాధులు సోకినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

సీహెచ్‌ఓల సమ్మెతో సమస్య తీవ్రం

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే సీహెచ్‌ఓలు గత 15 రోజులుగా సమ్మె చేస్తుండటం ప్రజారోగ్యంపై మరింత ప్రభావం చూపుతోంది. గిద్దలూరు నియోజకవర్గంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో విధులు నిర్వహిస్తున్న 73 మంది సీహెచ్‌ఓల్లో 50 మందికి పైగా సమ్మెలో ఉన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీహెచ్‌ఓలు కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో వారు సమ్మె విరమించడం లేదు. దీంతో వృద్ధులు, గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి సమస్యకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

జగనన్న హయాంలోనే మెరుగైన వైద్యం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం, ఉచితంగా మందులు అందించడంతోపాటు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు సైతం పల్లెలకు వచ్చారు. ఈ వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు అలాంటి వైద్య శిబిరాలు లేకపోవడం శోచనీయం.

– ఆవుల శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, బేస్తవారిపేట

వైద్య శిబిరాలు కొనసాగించాలి



గత ప్రభుత్వం మాదిరి ఇంటి వద్దకే వైద్యం, ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగించాలి. గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులో లేక స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పేదలు కూలీనాలీ చేసుకుని సంపాదించిన సొమ్ములో అధిక భాగం వైద్యానికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– వెన్నా బాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

గిద్దలూరు, మార్కాపురంలో కార్డన్ సెర్చ్


గిద్దలూరులో తనిఖీ చేస్తున్న పోలీసులు



మార్కాపురంలో తనిఖీ చేస్తున్న ఎస్సై

గిద్దలూరు రూరల్/మార్కాపురం: గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలెంలో స్థానిక సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 11 బైక్‌లు, 2 ఆటోలు సీజ్ చేసినట్లు సీఐ చెప్పారు.

మార్కాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీలో గృహాలను ఎస్సై రాజమోహన్‌రావు తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. గంజాయి, అక్రమ మద్యం కలిగి ఉన్నా, బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. చిన్నపిల్లలకు విక్రయించే తినుబండారాలను ఎక్స్‌పైరీ తేదీ చూసి ఇవ్వాలని దుకాణదారులకు స్పష్టం చేశారు.

చిట్టడవిలా రాచర్ల పెద్దచెరువు

- చిల్లచెట్లతో నిండిన చెరువు అంతర్భాగం
- పట్టించుకోని వెలిగొండ ప్రాజెక్టు అధికారులు
- అభివృద్ధి కోసం రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగం
- గుట్టుగా మట్టి తవ్వి తరలిస్తున్న కూటమి నాయకులు


చిల్లచెట్లతో నిండిన రాచర్ల చెరువు అంతర్భాగం


చెరువు తూము వద్ద మొలిచిన కంపచెట్లు

రాచర్ల: ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలోని పెద్ద చెరువు చిల్లచెట్లతో నిండి చిట్టడవిని తలపిస్తోంది. గతంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి చెరువు తూము, కట్ట అభివృద్ధి పనులు చేపట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. కట్టతోపాటు అంతర్భాగం మొత్తం భారీగా చిల్లచెట్లు మొలవడంతో చెరువు స్వరూపమే మారిపోయింది. పొలాలకు వెళ్లే రైతులు, పశు పోషకులు, గొర్రెల కాపరులను సైతం చెరువు పరిసరాలు భీతిల్లేలా చేస్తున్నాయి. రాత్రి వేళల్లో అడవి పందులు, ఎలుగుబంట్లు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిల్లచెట్ల కారణంగా నీరు కూడా నిల్వ ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. అధికార పార్టీ నాయకులు చెరువులో మట్టిని విచ్చలవిడిగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నీటికి స్టోరేజ్ పాయింట్ అయిన రాచర్ల పెద్ద చెరువు గురించి సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువులో మట్టి తవ్వకాలను అడ్డుకుని, చిల్లచెట్లు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

- మున్సిపల్ అధికారులకు ఆర్డీ ఓబులేసు ఆదేశం


మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్డీ ఓబులేసు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గుంటూరు మున్సిపల్ ఆర్డీ ఓబులేసు ఆదేశించారు. మంగళవారం పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగర్ కెనాల్ నుంచి 1.6 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న పైపులైన్ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందకొచ్చారని తెలిపారు. అనధికార భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి, నీటి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్ ఎస్‌ఈ టి.మోహన్ మాట్లాడుతూ.. నీటి సరఫరాకు సంబంధించి ఎమినిటీస్ సెక్రటరీలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల్లో పైపులైన్లు లేకుండా పైకి ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో కమిషనర్ నారాయణరావు, ఈఈ టి.శ్రీనివాస్ సంజయ్‌తోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య


బహుమతులు పొందిన చిన్నారులతో ఐసీడీఎస్ సిబ్బంది

మార్కాపురం: ఆటపాటలతో కూడిన విద్య బాలలకు అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం మార్కాపురం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని బాలికలకు సూచించారు. సంప్రదాయ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు.

మండలంలోని పెద్దయాచవరం, మొద్దులపల్లి గ్రామాల్లో బాలికలకు బాలల హక్కులు, రక్షణ, పోక్సోచట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై మహిళా పోలీసు రాజేశ్వరి అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, బాల్య వివాహాలను వ్యతిరేకించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్‌వీకేపీ కాలేజ్ లీజుకివ్వడం సరికాదు

- సబ్ కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కళాశాల(ఎస్‌వీకేపీ)ను వ్యాపార దృక్పథంతో ప్రైవేట్ కళాశాలలకు లీజుకు ఇవ్వకుండా యాజమాన్యమే కళాశాలను నిర్వహించాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సోమయ్య మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థులకు విద్యనందించాలని కోరారు. కళాశాలను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు కమిటీ సభ్యులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోనే సువిశాలమైన మైదానం, లైబ్రరీ, అధునాతన ల్యాబ్‌లు, భవనాలు ఉన్న కళాశాలను యాజమాన్యమే నిర్వహించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు.

గ్రీవెన్స్‌కు అధికారుల ఎగనామం!


కంభంలో గ్రీవెన్స్‌కు హాజరైన కొద్దిమంది అధికారులు

కంభం/అర్థవీడు: రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం గ్రీవెన్స్‌కు కొన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టడం రివాజుగా మారింది. గ్రీవెన్స్‌లో సుమారు 16 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా సగానికి పైగా గైర్హాజరవుతున్నారు. వచ్చిన కొద్ది మంది అధికారులు సైతం సంతకాలు చేసి వెళ్లిపోతుండటం గమనార్హం. కలెక్టర్ పర్యవేక్షించే గ్రీవెన్స్ కార్యక్రమానికి గత కొన్ని నెలలుగా మండల స్థాయి అధికారులు గైర్హాజరవుతున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంభంలో సోమవారం నిర్వహించాల్సిన మీ కోసం గ్రీవెన్స్ మంగళవారం నిర్వహించగా సగానికి పైగా అధికారులు గైర్హాజరయ్యారు. హాజరైన అధికారుల్లో తహసీల్దార్ మినహా మిగిలిన వారిలో ఎక్కువ మంది ఇన్‌చార్జిలే ఉన్నారు. అర్ధవీడులో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డితోపాటు మరో ఆరుగురు అధికారులే హాజరయ్యారు. అర్ధవీడులో ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమరవీరుడికి ఘన నివాళి


మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

కంభం:

ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన జవాన్ ఎం.మురళీ నాయక్ సంతాప సభను మంగళవారం కంభం మండల మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు శెట్టం వేణుగోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సైనికుడి కుటుంబానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేశీయ అస్త్రాల్లో ఒకటైన బ్రహ్మోస్ మిస్సైల్‌తో ఉగ్రవాదులకు గుణపాఠం నేర్పించడం గర్వంగా ఉందన్నారు. ముందుగా సైనికుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పుల్లయ్య, కెప్టెన్ నాగేశ్వర్ పగడాల, అంకయ్యగౌడ్, రామయ్య, ఎస్‌ఎం బాషా, మస్తాన్ వలి, సంకతాల ప్రసాద్, రగయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.